

సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

5న అంబర్‌పేట ఫ్లైఓవర్ ప్రారంభం

హాజరుకానున్న కేంద్ర మంత్రి గడ్కరీ : కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను మే 5వ తేదీన కేంద్ర రోడ్లు, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభిస్తారని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి వెల్లడించారు. రూ. 265.88 కోట్ల వ్యయంతో గోల్నాక చౌరస్తా నుంచి ఇరానీ హోటల్ వరకు 1.47 కిలోమీటర్ల మేర నిర్మించిన అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను మే 4 సాయంత్రం 5 గంటలకు ప్రారంభిస్తారని తెలిపారు. శనివారం రాత్రి బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం సమావేశానికి కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రూ.6,280 కోట్లతో తెలంగాణలో నిర్మించిన 285 కిలోమీటర్ల జాతీయ రహదారులను జాతికి అంకితం చేస్తారని తెలిపారు. ఆదిలాబాద్ నుంచి సాయంత్రం అంబర్‌పేటకు చేరుకుని ఫ్లైఓవర్‌ను ప్రారంభించిన తర్వాత మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించే సభలో నితిన్ గడ్కరీ పాల్గొని నగరంలో నిర్మించిన పలు ఫ్లైఓవర్లను వర్చువల్ విధానంతో ప్రారంభిస్తారని తెలిపారు. ఉప్పల్ ఫ్లైఓవర్ పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని కోరతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, బీజేపీ నేతలు, కార్పొరేటర్లు కన్నె ఉమాదేవి, వై.అమృత, సుచిత్ర, సరళ, తదితరులు పాల్గొన్నారు.



నర్ల సుధాకర్ శర్మ రచించిన మా కుటుంబ జీవనం నా జ్ఞాపకాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్

'మా కుటుంబ జీవనం నా జ్ఞాపకాలు' ఆవిష్కరణ

రాంనగర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : తన జీవితంలో జరిగిన పరిణామాలను రచయిత నర్ల సుధాకర్ శర్మ పుస్తకాన్ని సమాజానికి అందించడం అద్భుతమైన అంశం అని ప్రొఫెసర్ హరగోపాల్ పేర్కొన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నర్ల సుధాకర్ శర్మ రచించిన మా కుటుంబ జీవనం నా జ్ఞాపకాలు పుస్తకావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రబాబు, ప్రొఫెసర్ శ్రీనాథ్, రవి, శ్రీదేవి, అనురాధ, ఉదయమిత్ర,సులోచన, రాఘవచారి తదితరులు పాల్గొన్నారు.



కథా సంపుటిని ఆవిష్కరిస్తున్న ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కాశీం

'గాజులు కొనని రోజున' కథా సంపుటి ఆవిష్కరణ

రాంనగర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : సమాజాన్ని పట్టిపీడిస్తున్న అనేక రకాల సమస్యలను రచయిత కె.పి.లక్ష్మీనర్సింహ గాజులు కొనని రోజున కథల సంపుటి పుస్తకంలో ఆవిష్కరింపచేశారని ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కాశీం పేర్కొన్నారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో గాజులు కొనని రోజున కథా సంపుటి ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరై పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. మన జీవితంలో జరిగిన సంఘటనలు, మన చుట్టూ జరుగుతున్న పరిస్థితులను అద్భుతమైన కథల ద్వారా రచయిత ఆవిష్కరింపచేశారని ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రముఖ కవయిత్రి కొల్లాపురం విమల, అద్దంకి యాదగిరి, వెల్దండి శ్రీధర్, సంగిశెట్టి శ్రీనివాస్, అనంతోజు మోహనకృష్ణ, గోపాల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వినయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

వైభవంగా ముత్యాలమ్మ దేవాలయ వార్షికోత్సవం

చిక్కడపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ ఆంధ్రాకేఫ్ వద్దనున్న ముత్యాలమ్మ దేవాలయం 25వ వార్షికోత్సవం ఆదివారం వైభవోపేతంగా జరిగింది. ఆలయ కమిటీ, గాంధీనగర్ యువజనసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దఎత్తున పూజల్లో పాల్గొన్నారు. మాలబస్తీ అధ్యక్షుడు జీఎస్ మధుసూదన్, ఉపాధ్యక్షులు జి.మదన్‌మోహన్, జాయింట్ సెక్రటరీ జి.విజయ్‌కుమార్, ఆర్గనైజర్, బీజేపీ నేతలు అరుణ్‌కుమార్, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'ఎన్‌హెచ్‌ఎఫ్‌డీసీ రుణాలను పునరుద్ధరించాలి'

చిక్కడపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ వికలాంగుల ఆర్థిక అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్‌ఎఫ్‌డీసీ) రుణాలను పునరుద్ధరించాలని, గతంలో రుణాలు తీసుకుని ఎగవేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు టి వరమ్మ, అధ్యక్ష, కార్యదర్శులు కె. వెంకట్, అడివయ్య, కోశాధికారి ఆర్ వెంకటేష్‌లు ఒక ప్రకటన విడుదల చేశారు. సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వశాఖ వికలాంగుల సాధికారత విభాగం ఆధ్వర్యంలో వికలాంగులలో ఆర్థిక పునరావాసం కోసం ఆర్థిక సాయం అందించి వికలాంగులు వారి వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవడానికి అందించే రుణాలను నిలిపివేయడం జరిగిందన్నారు. వెంటనే రుణాలను పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు.



శబరిమల సేవా సంఘం ఆలిండియా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా బుచ్చిరెడ్డిని శాలువా కప్పి సత్కరిస్తున్న నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృత, మాజీ కార్పొరేటర్ వనం రమేష్, ఆనంద్‌గౌడ్
- నల్లకుంట, ఆంధ్రజ్యోతి



వాసవి సేవా సమితి అన్నదానం

అమావాస్యను పురస్కరించుకుని రాంనగర్ వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం రాంనగర్ చౌరస్తాలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న అధ్యక్ష కార్యదర్శులు వాడకట్టు రాజు, చల్ల శివకుమార్ కోశాధికారి గంజి శ్రీనివాస్.

- రాంనగర్, ఆంధ్రజ్యోతి



పద్మాకాలనీలో యోగా టీచర్, కరాటే స్టూడెంట్స్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ



తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో రాంనగర్ చౌరస్తాలో కొవ్వొత్తులతో ర్యాలీ

ఉగ్రదాడిపై నిరసన ర్యాలీ

రాంనగర్, కవాడిగూడ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : జమ్మూకశ్మీర్‌లోని పహెల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ ఆదివారం ముషీరాబాద్, అంబర్‌పేట, కవాడిగూడ నియోజకవర్గాలలో పలు అసోసియేషన్లు, కాలనీ సంఘాలు, ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి, ఐక్య దళిత సంఘాల వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి మృతులకు నివాళులర్పించారు.



ఓయూ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శివం చౌరస్తాలో కొవ్వొత్తులతో ర్యాలీ



టీడీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన



లోయర్‌ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహంవద్ద ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ ఆందోళన చేస్తున్న ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి నేతలు



ఇందిరాపార్కులో ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

విద్యార్థులు ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలి

రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద

కవాడిగూడ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వేసవి శిబిరాల ద్వారా విద్యార్థుల జీవితాల్లో మార్పుతీసుకువస్తున్నామని రామకృష్ణమఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద తెలిపారు. స్వామి వివేకానంద ఇనిస్టిట్యూట్‌ఆఫ్ హ్యూమన్ ఎక్స్‌లెన్సీ ద్వారా ఇప్పటి వరకు 20 లక్షల మందికిపైగా విద్యార్థులను తీర్చిదిద్దామని స్వామి బోధమయానంద వివరించారు. ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని రామకృష్ణ మఠంలో సంస్కార్ వేసవి శిబిరం ప్రారంభోత్సవం సందర్భంగా జరిగిన సమావేశంలో స్వామి మాట్లాడారు. విద్యార్థులు ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకునేలా శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. రామకృష్ణ మఠం ద్వారా శిక్షణ పొందిన విద్యార్థులు యువకులు జాతి నిర్మాణంలో చురుగ్గా పాలుపంచుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన కిమ్స్‌ఆసుపత్రి సిఎండి భాస్కర్‌రావు మాట్లాడుతూ, జీవితంలో క్రమశిక్షణ గల ప్రాధాన్యతను వివరించారు. పిల్లలు తల్లిదండ్రుల నుంచి విలువలు నేర్చుకుంటారని చెప్పారు. విద్యద్వారా జీవితాలను ఎలా తీర్చిదిద్దుకోవచ్చో ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ మఠం వాలంటీర్లు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రామకృష్ణ మఠంలో వేసవి శిబిరాలను ప్రారంభిస్తున్న స్వామి బోధమయానంద, కిమ్స్ ఆసుపత్రి సీఎండీ భాస్కర్ రావు

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు నిధులను కేటాయించాలి

జై భీమ్ సేన ఫైట్ ఫర్ రైట్స్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పి.బల్వంత్‌రావు

నల్లకుంట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో బాధితులకు చెల్లించాల్సిన ఉపశమన పునరావాస నిధులను వెంటనే కేటాయించాలని జై భీమ్ సేన ఫైట్ ఫర్ రైట్స్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పి.బల్వంత్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పోలీస్ స్టేషన్లలో ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయడం లేదని, బాధితులు ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించిన తర్వాతనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదవుతున్నాయని పేర్కొన్నారు. అట్రాసిటీ కేసుల్లో విచారణ చేస్తున్న పోలీసులు వివరాలు ఆలస్యం చేస్తున్నారని తద్వారా ఎస్సీ, ఎస్టీ కేసులు నిర్వీర్యం చేసే పనిలో పోలీసు శాఖ ఉందని ఆయన ఆరోపించారు. దీంతో బాధితులకు సత్వర న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లు ఎస్సీ, ఎస్టీ బాధితులకు ప్రత్యేక సమయం కేటాయించి మనోధైర్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

ఎస్సీ, ఎస్టీ వర్గాల రక్షణ కోసం రూపొందించిన చట్టాలు కల్పించిన హక్కులు పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ విషయంలో అధికార, ప్రతిపక్ష ఎస్సీ, ఎస్టీల మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పార్లమెంట్, అసెంబ్లీలో తమ గళం వినిపించడం లేదని ఆరోపించారు. సదరు ప్రజాప్రతినిధులు జాతి ప్రయోజనాల కన్నా వ్యక్తిగత స్వార్థం కోసం పనిచేస్తున్నారని విమర్శించారు. అట్రాసిటీ కేసుల్లో పోలీస్ స్టేషన్ బెయిల్ రద్దు చేయాలని, నాన్ బెయిల్ వారెంట్ అమలు జరిగేలా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ అట్రాసిటీ నిధులు మంజూరు చేయాలని, జాతీయ హెల్ప్ డెస్క్ ఎస్సీ, ఎస్టీ సభ్యులపై అఘాయిత్యాలు, నివారణ ద్వారా సహాయం అందడం లేదని, ఈ విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పి.బల్వంత్‌రావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నాలా పూడికతీత పనులు పూర్తి చేయాలి

కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్



వినోభానగర్‌లో నాలా పూడిక తీత పనులను పరిశీలిస్తున్న లింగాల శ్రీకాంత్ గౌడ్

ముషీరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో సమస్యలు తలెత్తకుండా నాలాలో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగింపు పనులను పూర్తిచేసి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల శ్రీకాంత్ గౌడ్ డిమాండ్ చేశారు. ముషీరాబాద్ డివిజన్ వినోభానగర్ ప్రేయర్‌పవర్ చర్చ్‌నుంచి జాంబవినగర్ ప్రధాన రోడ్డు వరకు గల కచ్చానాలలో పూడికతీత పనులు జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి లింగాల శ్రీకాంత్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చిన్నపాటి వర్షానికే నాలా పరివాహక ప్రాంతాలు వరద నీటితో నిండిపోతాయని పేర్కొన్నారు. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని జీహెచ్‌ఎంసీ అధికారులు బాధ్యతతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జయకుమార్, సురేందర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు



ముషీరాబాద్ పార్శిగుట్ట చౌరస్తాలో బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే ముఠాగోపాల్, శ్రీకాంత్ ముదిరాజ్



బహిరంగ సభకు మహిళా నాయకురాళ్లతో కలిసి బస్సులో తరలివెళుతున్న గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు తరలిన నేతలు

ముషీరాబాద్, రాంనగర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ రజతోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ముషీరాబాద్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పి.శ్రీకాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పార్శిగుట్ట చౌరస్తాలో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్ జెండా ముషీరాబాద్‌నుంచి సభకు వెళ్లే బస్సు ర్యాలీలను ఆయన శ్రీకాంత్‌తో కలిసి ప్రారంభించారు. నియోజకవర్గం నుంచి వందలాది బస్సులు, కార్లతో బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. అంతకుముందు రాంనగర్‌లో పార్టీ జెండాను మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, జైసింహ ఆవిష్కరించారు. బాగ్‌లింగంపల్లిలోని శ్రీరామ్‌నగర్‌లో బీఆర్‌ఎస్ నాయకుడు వివేక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ జెండాను బీఆర్‌ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జీ తలసాయి కిరణ్‌యాదవ్ ఆవిష్కరించారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి డివిజన్‌లో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి కార్యకర్తలతో బస్సుల్లో వరంగల్ సభకు తరలివెళ్లారు.



గోల్నాక డివిజన్ నుంచి జిందాతిలిస్మాత్ రోడ్‌లో బస్సులను జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సతీమణి, మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మావెంకటేష్, తనయుడు కాలేరు మణికాంత్

నిరంతరం ప్రజాసేవలో..

కర్ణకు నివాళులు అర్పించిన పలువురు నేతలు



సీహెచ్ కర్ణ (ఫైల్)

ముషీరాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ వీర అభిమాని ముషీరాబాద్‌కు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు సీహెచ్ కర్ణ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని మాజీ కార్పొరేటర్ అరుణ జయేందర్‌బాబు అన్నారు. టీడీపీ ఆవిర్భవించినప్పుడు ఎన్‌టీఆర్‌పై ఉన్న అభిమానంతో పార్టీలో చేరి ముషీరాబాద్‌లో టీడీపీ బలోపేతానికి ఎంతో కృషిచేశారని ఆమె తెలిపారు. మొట్టమొదటిసారి నియోజకవర్గంలోని దాయార మార్కెట్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించడంతో పాటు భారీ బహిరంగ సభను నిర్వహించి తన ప్రత్యేకతను చాటుకున్నారన్నారు. రైల్వే శాఖలో విధులు నిర్వహిస్తూనే టీడీపీలో చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. ఈ నెల 18న అనారోగ్యంతో మృతిచెందడంతో వివిధ పార్టీల నేతలు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. సోమవారం ముషీరాబాద్ డివిజన్ గంగపుత్ర కాలనీలో సంతాప సభ నిర్వహించనున్నట్లు ఆయన కూతురు మాజీ కార్పొరేటర్ అరుణ జయేందర్‌బాబు తెలిపారు.



సుందరయ్య కేంద్రంలో నృత్యం చేస్తున్న కళాకారులు

కళాకారుల నృత్య ప్రదర్శన

రాంనగర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ నృత్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్ఫూర్తి మ్యూజికల్ అకాడమి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో స్ఫూర్తి నేషనల్ డాన్స్ ఫెస్ట్ - 2025 కార్యక్రమం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇ.ఎస్.సూర్యనారాయణ అధ్యక్షతన జరిగింది. వివిధ రంగాలకు చెందిన కళాకారులు నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నాట్యకళాకారులకు నాటరాజ మొమెంటో సర్టిఫికెట్ల ప్రదానం జరిగింది.

పాస్టర్ ప్రవీణ్ రీ పోస్టుమార్టం నిర్వహించాలి

- క్రైస్తవ సంఘాల నేతల డిమాండ్

కవాడిగూడ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : క్రైస్తవ మత ప్రచారకుడు పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతదేహానికి సమగ్రమైన రీ పోస్టుమార్టం నిర్వహించాలని ద నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ ఇండియన్ క్రిస్టియన్, గ్లోబల్ అలయన్స్ ఆఫ్ క్రిస్టియన్ లీడర్స్ అధ్యక్షుడు సీపే డానియేల్ ఆడమ్స్, డేవిడ్ శాంతరాజ్‌లు ఏపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీ.ఆర్. అంబేడ్కర్ విగ్రహం వద్ద పాస్టర్ ప్రవీణ్ పగడాల వివాదాస్పద మరణాన్ని నిరసిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శనతో నివాళులర్పించారు.

ఫ్లెక్సీల ఏర్పాటు పై బెయిల్‌పై బీజేపీ నేతల విడుదల

రాంనగర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఫ్లెక్సీల ఏర్పాటు నేపథ్యంలో బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు జి.భరత్‌గౌడ్, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు సాయికృష్ణయాదవ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆర్.శేషసాయిలు ఆదివారం నల్లకుంట పీఎస్‌కు హాజరై స్టేషన్ బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై తప్పుడు కేసు నమోదు చేశారని ఆరోపించారు.



హర్ ఆర్ట్ గ్యాలరీని సందర్శించిన యూనివర్శిటీ విద్యార్థులు

హర్ ఆర్ట్ గ్యాలరీ సందర్శన

చిక్కడపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ హస్తకళాకారిణి డా. కమలాప్రసాదరావు సృష్టించిన 1200 అద్భుత హస్తకళాకృతుల హర్ ఆర్ట్ గ్యాలరీని ఆదివారం ప్రొ.జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు సందర్శించారు. పాఠ్యప్రణాళికలో భాగంగా దోహదపడుతున్న ఈ గ్యాలరీని విద్యార్థులు సందర్శించి కళారూపాల తయారీ విషయాల్లో మెలకువలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమలాప్రసాదరావును విద్యార్థులు అభినందించారు. గ్యాలరీ మేనేజింగ్ ట్రస్టీ పీవీఎస్ ప్రసాదరావు, వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆచార్యులు భానురేఖ తదితరులు పాల్గొన్నారు.